కోదండ రామాలయానికి వెండి విసనకర్రలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతిలోని శ్రీకోదండరామాలయానికి రూ.1.20 లక్షలు విలువ గల రెండు వెండి చామరాలు (విసనకర్రలు) విరాళంగా అందజేశారు. తిరుపతికి చెందిన వెంకటేశ్వరయ్య, ఉదయలక్ష్మీ దంపతులు ఈ విరాళాన్ని ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్నకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆనందకుమార దీక్షితులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లు వేస్తే చర్యలు

బ్యాలెట్‌లో అంకెలు మాత్రమే రాయాలి
ఓటరుస్లిప్‌తో గుర్తింపుకార్డు తప్పనిసరి
రాజకీయ పార్టీలతో కలెక్టర్ సమావేశం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



మార్చి 13న జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికల్లో దొంగ ఓట్లు వేస్తే చర్యలు తప్పనిసరిగా తీసుకుంటామని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. బ్యాలెట్ పత్రంలో అంకెలు మాత్రమే పెన్‌తో రాయాలని సూచించారు. ఓటు హక్కు వినియోగించుకునే విధానంలో 1 అంకె లేదా రోమన్ అంకెలు తప్పనిసరి మార్క్ చేయాలని, 1 లేకుండా 2, 3, 4 ... ఇలా వేస్తే చెల్లదని, ప్రాధాన్యత ప్రకారం 1 నుంచి బ్యాలెట్‌లో ఉన్న ఎంతమందికైనా మార్క్ చేయవచ్చని తెలిపారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీలతో కలెక్టర్ సమావేశమై పోలింగ్ ప్రక్రియను వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ మెటీరియల్, బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసి ఈనెల 12న జిల్లాలో నాలుగు డివిజన్ కేంద్రాల నుంచి పంపిణీ చేస్తామన్నారు. 13న పోలింగ్ అనంతరం కేంద్రాల వద్ద రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేసి బ్యాలెట్ బాక్సులను భద్రపరచి, ఆపై చిత్తూరు స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తామన్నారు. ఆ సమయంలో తప్పనిసరి ఏజెంట్లను సూచించాలన్నారు. ఒకే ఇంటి నంబర్‌తో పలు ఓటర్లు జాబితాలో చోటు చేసుకున్నాయని, పూర్తిస్థాయిలో పరిశీలించి ఓటరు స్లిప్స్ పంపిణీ చేస్తామన్నారు. ఏజెంట్లు పోలింగ్ రోజు ఉదయం 7 గంటలకల్లా పిఒ వద్ద ఆథరైజేషన్ లెటర్ ఇచ్చి పాస్ పొందాలన్నారు. ఓటరు కాని వారు ఎవరైనా ఓటు వేయడానికి వస్తే అతనిపై కేసు నమోదు చేస్తామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో అందిన ఫిర్యాదుల మేరకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా 13 చోట్ల పటిష్ట బందోబస్తు, పిఒల వద్ద ఎఎస్‌డి ఓటర్ల లిస్టు అందుబాటులో ఉంచి దొంగ ఓట్ల నియంత్రణ, కేసుల నమోదుకు చర్యలు చేపట్టామని వివరించారు. ఇచ్చిన ఫిర్యాదులను సహృదయంతో పరిష్కరించిన కలెక్టర్‌కు సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వి.నాగరాజు, పి.మురళి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమీక్షలో రాజకీయ పార్టీల ప్రతినిదులు వైఎస్ఆర్ కాంగ్రెస్ నుంచి వెంకటేష్, టిడిపి నుంచి చంద్రశేఖర్, బిజెపి నుంచి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులకే మా మద్దతు : జైభీమ్ ఆర్మీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఈనెల 13వ తేదీన జరగనున్న తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ(పట్టభద్రులు, ఉపాధ్యాయులు) ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులకే తమ సంపూర్ణ మద్దతని జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు పులి శ్రీకాంత్ స్పష్టం చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఆయన వామపక్ష పార్టీలు, వాటి అనుబంధ సంఘాల నాయకులను కలసి పీడీఎఫ్ అభ్యర్థులకు తన మద్దతును ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ తన మూడున్నరేళ్ల పాలనలో తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నారని విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయన్నారు. ఉపాధ్యాయులపై కక్ష సాధింపులు ఎక్కువై పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పీడీఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని జై భీమ్ ఆర్మీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జై భీమ్ ఆర్మీ నాయకుడు ఐటీయూ నాయకుడు రమేష్, సిఐటియు నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లు వేయడానికి ప్రయత్నిస్తే జైలుశిక్షే : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఎంఎల్‌సి ఎన్నికల్లో దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నిస్తే జైలుశిక్ష తప్పదని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. ఫిర్యాదులు అందిన వారి పేర్లను ఎఎస్‌డి లిస్టు పిఒల వద్ద అందుబాటులో ఉంచి పరిశీలిస్తామన్నారు. తిరుపతిలో అన్ని పోలింగ్ కేంద్రాలలో పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కలెక్టరేట్‌లో సోమవారం మధ్యాహ్నం ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణపై మీడియాతో మాట్లాడారు. గత రెండు మూడు రోజులుగా ఒకే ఇంటి నంబర్‌తో ఎక్కువ ఓట్లు ఉన్నాయని, బోగస్ సర్టిఫికేట్లు పెట్టారని సిఇఒ నుంచి రాజకీయ పార్టీల నుంచి ఫిర్యాదులు అందాయని, పరిశీలిస్తే కంప్యూటర్ ఎంట్రీ సమయంలో జరిగిన పొరబాట్లన్నారు. దరఖాస్తులలో ఉన్న అడ్రస్సులను పరిశీలిస్తే ఆ ఓటర్లు ఉన్నారని తేలిందన్నారు. ఓటరు జాబితాలో డేటాఎంట్రీలో తప్పులు రావడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. 138 పోలింగ్ కేంద్రాలు ఉంటే ఆరు పోలింగ్ కేంద్రాల పరిధిలో జరిగిందన్నారు. ఒకే ఇంటి నంబర్‌పై ఉన్న ఓట్లను పరిశీలిస్తే 110 తేలాయన్నారు. దరఖాస్తుల మేరకు ఆ ఓటర్లు వేరే అడ్రస్సులో ఉన్నారని తెలిసిందన్నారు. గెజిటెడ్ అధికారుల అటేస్టడ్ సర్టిఫికేట్లు ఉన్నా వాటిని ఓటరు జాబితాలో ఉంచామన్నారు. 14 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించామన్నారు.

ప్రలోభాలకు 'ఎర'

డబ్బు తీసుకోకపోతే అంతు తేలుస్తాం!
ప్రభుత్వ టీచర్లకు 'వైసిపి' బెదిరింపులు
చిన్న విద్యాసంస్థలకు రూ.5 లక్షలు
కార్పొరేట్ సంస్థలకు రూ.10 లక్షలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అధికార వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌సి పదవుల కోసం నానా గడ్డి కరుస్తోంది. సామదాన దండోపాయాలను ఉపయోగిస్తోంది. ఎన్నికల చేర్పింపు నుంచి పోలింగ్ వరకూ మంత్రులు, ఎంఎల్‌ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఎలాగైనా పిడిఎఫ్ ఎంఎల్‌సిల స్థానంలో అడ్డదారులు తొక్కి వైసిపి అభ్యర్థులను గెలిపించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాయి. ఆత్మీయ సమావేశాలు, విందులు, రహస్య మంతనాలు జరుపుతున్నాయి. వాలంటీర్లు ద్వారా ఈ కార్యక్రమం గుట్టుచప్పుడు కాకుండా నడుస్తోంది. ముఖ్యంగా చంద్రగిరి, పుంగనూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎంఎల్‌ఎలు స్వయంగా రంగంలోకి దిగి టీచర్ల సంఘాలనూ, టీచర్లను బెదిరింపులకు పాల్పడుతున్నారు. 'మేం ఇచ్చిన ఓటుకు నోటు తీసుకోకపోతే మండలాల్లో పనిచేయలేరు. బదిలీల ఉంటాయి' అని బెదిరిస్తున్నారు. ముఖ్యంగా చిన్నగొట్టిగల్లు, రొంపిచెర్ల, యర్రావారిపాలెం, చంద్రగిరి, పాకాల మండలాల్లో బెదిరింపులకు దిగుతున్నారు. ఎంఎల్‌సి కల్పలతారెడ్డి నేరుగా చిత్తూరు గిరింపేట మున్సిపల్ టీచర్లతో ఒక్కో ఓటుకు ఐదువేల రూపాయలు ఇచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి మున్సిపల్ టీచర్ల సంఘం నాయకులు నాయకత్వం వహించడం గమనార్హం. తిరుపతి బైరాగిపట్టెడలోని ఆర్ఆర్ ప్రైవేట్ విద్యాసంస్థలో విందులు, వినోదాలు ఏర్పాటు చేసి ప్రైవేట్ టీచర్లకు ఓటుకు మూడు నుంచి ఐదువేల రూపాయలు పంచేశారు. తిరుపతి రూరల్‌లో చిగురువాడ, మల్లంగుంట, సి.మల్లవరం, తిరుచానూరు, పెరుమాళ్లపల్లి, గొల్లపల్లి పంచాయతీల్లో వాలంటీర్లే స్లిప్పులతో పాటు ప్రైవేట్, ప్రభుత్వ టీచర్లకు ఐదువేల రూపాయల పంపిణీకి సిద్ధమయ్యారు. తిరుపతి 48వ డివిజన్‌లో శుక్రవారం రాత్రి ఓటుకు 500 ఇచ్చేందుకు అధికార పార్టీ తెరలేపింది. పుంగనూరు నియోజకవర్గంలో పుంగనూరు, చౌడేపల్లి, రామసముద్రం మండలాల్లో అధికార పార్టీ ఏజెంట్లుగా తయారై బహిరంగంగానే ఓటుకు ఐదువేలు ఇస్తున్నారు. చౌడేపల్లిలో ప్రభుత్వ టీచర్లు 'మేం గురువులం.. విద్యార్థులకు విద్యా బుద్ధులు చెప్పి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే స్థాయి మాది.. ఓటుకు అమ్ముడుబోం.. స్వతంత్రులుగా ఉంటాం.. మీ డబ్బు మాకొద్దు' అంటూ ఖరాఖండిగా చెప్పడంతో వైసిపి నాయకులు తిరుగుమొఖం పట్టారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తొట్టంబేడు, రేణిగుంటలలో ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలోనే పంపిణీలు టకటకా జరిగిపోతున్నాయి. వెంకటగిరి నియోజకవర్గంలో నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి సంబంధించి ఎన్‌బికెఆర్ స్కూలు సిబ్బంది ద్వారా పంపిణీ జరుగుతోందని తెలుస్తోంది. పుంగనూరు పెద్దిరెడ్డి, చంద్రగిరి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శ్రీకాళహస్తి బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, గూడూరు వరప్రసాద్‌రావు, తిరుపతి కరుణాకర్‌రెడ్డి బాధ్యత తీసుకుని పోటాపోటీగా పంపిణీ కార్యక్రమాన్ని రాత్రికి రాత్రే ఊపందుకునేలా చేస్తున్నారు. పట్టభద్రులు, టీచర్ల ఓటింగ్‌లో ఏ నియోజకవర్గానికి ఎక్కువ ఓట్లు వస్తే సిఎం జగన్ వద్ద మన్ననలు పొందేందుకు పోటీ పడుతున్నారు. ఏదిఏమైనా చిన్నపాటి ప్రైవేట్ స్కూళ్లకు ఐదు లక్షలు, కార్పొరేట్ వాటికి పది లక్షల పైన నజరానా ప్రకటించినట్లు తెలుస్తోంది. శని, ఆదివారాల్లో మందు, విందు ప్రవాహం ఊపందుకోనుంది. మేధావులు పోటీ చేసే ఎన్నికల్లో అధికార పార్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా నీచ రాజకీయాలకు పాల్పడటం పాల్పడటం విమర్శలకు తావిస్తోంది.

ఆధ్యాత్మిక తిరుమల కొండపై...

రౌడీషీటర్లకూ 'పట్టం'

ప్రజాశక్తి - తిరుమల

ఒక భార్యకు 18 మంది భర్తలను చూశాం.. ఒక కొడుక్కి 11 మంది తండ్రులూ ఉన్నారు.. ఇరుకు గదిలో 24 మంది ఓటర్లు ఉన్నారు.. ఖాళీస్థలంలో 10 -27 మంది ఉన్నారు.. ఇవన్నీ వారం రోజులుగా సిఐటియు బృందాల పరిశీలనలో పట్టభద్రుల దొంగోట్లుగా వెలుగులోకి వచ్చిన వాస్తవాలు.. అధికార పార్టీ వైసిపి అధికారాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవాలని అక్రమాల పర్వానికి తెరలేపిన నేపథ్యంలో వైసిపి ఎన్నికల సిత్రాలివి.. తాజాగా శ్రీవారి చెంతనే తిరుమలలో రౌడీషీటర్లకు పట్టభద్రుల ఓటు కల్పించిన ఘనత వైసిపికే మరోమారు దక్కుతుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో విమర్శించారు. గత కొన్ని రోజులుగా తమ పరిశీలనలో బోగస్ ఓట్లను అధికారుల దృష్టికి, ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళుతున్నా చర్యలు శూన్యమని విమర్శించారు. తాజాగా తమ పరిశ్రలనలో తిరుమల కొండపై రౌడీషీటర్లుగా ఉన్న బెల్లం రమేష్, సోమశేఖర్‌లు పట్టభద్రుల ఓటర్లుగా నమోదై ఉండటం తమకు ఆశ్చర్యాన్ని కలిగించిందని పేర్కొన్నారు. పోలింగ్ బూత్ నెం. 230లో వరుస నెంబరు 408, 490లలో వీరి పేర్లు నమోదయి ఉన్నాయని తెలిపారు. తమ కార్యకర్తల పరిశీలనలో బెల్లం రమేష్, సోమశేఖర్‌లు డిగ్రీ చదవలేదని తేలిందని, ఒకరు ఐదవ తరగతి, మరొకరు 10వ తరగతి కూడా పూర్తి చేయని వీరికి డిగ్రీ పూర్తి చేసినట్టుగా ఓటు నమోదు కావడమే కాకుండా, ఓటర్ లిస్టులో వారి ఫోటోలతో సహా ప్రచురించడం దారుణమని విమర్శించారు. వైసిపి అన్ని విలువలు వదిలి గెలుపే లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు సిగ్గుచేటని అన్నారు. మేధావుల ఎన్నికల్లో అత్యంత బాధ్యతారాహిత్యమైన పద్ధతుల్లో వైసిపి వ్యవహరిస్తోందని అనటానికి నిదర్శనంగా పై ఘటనను పేర్కొన్నారు. తిరుమల కొండమీద ఆధ్యాత్మిక క్షేత్రంలో సైతం ఇలాంటి వాటికి ఆస్కారం ఇచ్చే పద్ధతిలో అధికారులు వ్యవహరించడాన్ని తప్పుపట్టారు. తిరుమల కొండపై ఏ ఒక్కరిని అడిగినా వీరి నేర చరిత్రను తెలియజేస్తారని, రౌడీషీటర్లన్న విషయం పోలీసులకి, అధికారులకి, స్థానికులకు తెలుసునని, తిరుమలలో ఎవరిని అడిగినా చెబుతారని ఇట్లాంటి వాళ్లకు పట్టభద్రుల ఓటు ఇవ్వడం అన్యాయమని అన్నారు. తిరుమల కొండపై 150 ఓట్లు ఉంటే తమ పరిశీలనలో 32 ఓట్లు బోగస్ ఓట్లని తేలిందని అన్నారు. ఈ వివరాలను రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తున్నామని ఓటు నమోదుకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులను వేధిస్తూ కక్షసాధింపు

ఫ్యాప్టో రాష్ట్ర ఛైర్మన్ వెంకటేశ్వర్లు
డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేస్తే జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఫ్యాప్టో రాష్ట్ర ఛైర్మెన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వైఖరిని నిరశిస్తూ శుక్రవారం స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో నేతృత్వంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేస్తూ కక్షసాధింపులకు పాల్పడం దుర్మార్గంగా ఉందన్నారు. షోకాజ్ నోటిసులు జారీ చేయడం వంటి చర్యలు మానుకోవాలన్నారు. ప్రభుత్వ వేధింపుల కారణంగా ఆరుగురు ఉపాధ్యాయులు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. బోధనేతర పనులు 60 రికార్డులు, 26 యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులు విద్యార్థుల బోధనపై సమయం కేటాయించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యా సంస్కరణల పేరుతో ప్రాథమిక, ఉన్నత విద్యను నాశనం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఉపాధ్యాయుల సఖ్యను తగ్గించడంతో పాటు పాఠశాలల విలీనం పేరుతో మూసి వేసే కార్యక్రమానిన చేపడుతోందని, ప్రభుత్వ విరంకుశ వైఖరిని ఉపాధ్యాయ సంఘాలు ఐఖ్యంగా ఎదుర్కోవాలన్నారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఉపాధ్యాయులను వేధించడం పనిగా పెట్టుకోవడం అత్యత శోచనీయమని, వైఖరి మార్చుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాప్టో నేతృత్వంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు జివి రమణ, చెంగల్రాయ మందడి, గుణశేఖర్‌రెడ్డి, శేఖర్, కత్తి శేఖర్, ఎస్ఎం భాషా, ముక్తార్ అహ్మద్‌లతో పాటు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపుకై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - సత్యవేడు



ఈనెల 13వ తేదీ జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులుగా టీచర్ శాసనమండలికి పొక్కిరెడ్డి బాబురెడ్డికి, గ్రాడ్యుయేషన్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లురెడ్డికి అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కెవిపిఎస్ జిల్లా నాయకులు అరుణాచలం, సిఐటియు నాయకులు ఎం.రమేష్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మీగడ వెంకటేశ్వర్‌రెడ్డికి (21), పొక్కిరెడ్డి బాబురెడ్డికి (6) ఓటు వేసి గెలిపించాలని కోరారు. సత్యవేడు కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ సభ్యులను, టిడిపి నాయకులను కలిసి కరపత్రాలు ఇచ్చి ప్రచారం చేశారు.

పిచ్చాటూరులో... సిపిఎం మండల కార్యదర్శి రామచంద్రారెడ్డి, సిపిఐ సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్, సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఎఐటియుసి నాయకులు నాగేంద్ర, జనసేన జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

చిల్లకూరులో... మండలంలో మండల రెవెన్యూ కార్యాలయాల్లో, పొదుపు కార్యాలయాల్లో, ప్రైవేట్ కాలేజీల్లో, ప్రభుత్వ గురుకుల కాలేజీల్లో ఓటర్లను సిఐటియు రాష్ట్ర నాయకులు మిరియం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఎస్.ముత్యాలయ్య, జోగి శివయ్య, అడబాల ప్రసాద్ పాల్గొన్నారు.

బిఎన్ కండ్రిగలో.. చెక్‌పోస్టు ఆవరణలో సిఐటియు నాయకులు రమణయ్య, బాలగురవయ్య ఆధ్వర్యంలో ముమ్మరంగా ప్రచారం చేశారు. మీగడ వెంకటేశ్వర్‌రెడ్డిని, పి.బాబురెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత ఉద్యోగ కార్మిక సంఘాలు, కష్టజీవులు, నిరుద్యోగులపై ఉందన్నారు.

కోటలో.. సిఐటియు నాయకులు ఎం.హరనాథ్, కె.రమణయ్య ఆధ్వర్యంలో చిట్టేడు, మద్దాలి, కేశవరం, ఊసుగుంటపాలెం గ్రామాల్లో ఉండే పట్టభద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటును పీడీఎఫ్ అభ్యర్థులకే వేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పిఆర్‌సి బకాయిలు చెల్లించాలి

పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం తనలో విలీనం చేసుకున్న తరువాత వారికి ఆనందం కంటే ఆక్రోశమే మిగిలిందని పీడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. తిరుపతిలో ఆర్టీసీ ఉద్యోగులను కలిసి వారి సాదక బాధలను విన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు 2017 నుంచి పిఆర్‌సి అరియర్లు రావాలని, 2020 విలీనం తరువాత వాటిని చెల్లిస్తామని చెప్పినా ఇంతవరకూ అతీగతీ లేదన్నారు. బోనస్, సంపాదిత సెలవులు, డే ఔట్, నైట్‌ఔట్, ఓవర్‌టైం అలవెన్స్‌లు, ఆఖరికి యూనీఫాం కూడా లేదని ఆర్టీసీ ఉద్యోగులు వాపోయారు. ఆర్టీసీ ఆధునీకరణ పేరుతో స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. పని ఒత్తిడి పెరిగి డ్రైవర్లు, కండక్టర్లకు గుండెపోటు వస్తుందన్నారు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు...

ఉద్యోగ భద్రత, మినిమం టైంస్కేల్ ఇవ్వాలి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి పి.బాబురెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పి, నాలుగేళ్లు కావస్తున్నా ఒక్కరినీ రెగ్యులర్ చేయలేదని,.. అవుట్‌సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీ, పార్ట్ టైం అకాడమిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో అతి తక్కువ జీతాలతో పని చేయించుకుంటున్నారని ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని పిడిఎఫ్ పక్షాన శాసనమండలిలో కషి చేస్తామని తూర్పు రాయలసీమ పిడిఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పి. బాబురెడ్డి అన్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులకు ఉద్యోగులకు ఉన్న సౌకర్యాలు కాంట్రాక్టు, తాత్కాలిక ఉద్యోగులందరికీ వచ్చేలా కషి చేస్తామని తెలిపారు. తాత్కాలిక ఉద్యోగులందరూ రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నప్పటికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చట్టం ఉన్నా ప్రభుత్వం అమలు చేయకపోవడం వివక్షతో కూడిందన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సెలవులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదని వెంటనే ప్రభుత్వ హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో పోరాటం చేస్తామని కాంట్రాక్ట్, తాత్కాలిక ఉపాధ్యాయులకు,అధ్యాపకులకు, ఉద్యోగులకు అండగా నిలబడతామని తమకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బాబు రెడ్డి పొక్కిరెడ్డి కోరారు..

15 నుంచి ఇంటర్ పరీక్షలు : డిఆర్‌ఒ

హాజరుకానున్న 58,550 మంది విద్యార్థులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈ నెల 15 నుండి ఏప్రిల్ 4 వరకు ఇంటర్ మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం పరీక్షలు నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో ఇంటర్ మీడియట్ పరీక్షల నిర్వహణ పై జిల్లా రెవెన్యూ అధికారి సమీక్ష నిర్వహించారు. ఆర్ఐఓ వి.రమేష్ , జిల్లా అధికారులు హాజరయ్యారు. జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ ఇంటర్ మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం పరీక్షల నిర్వహణ సమయం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని, పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు, ఉదయం 6.00 గంటల నుండి పరీక్షా కేంద్రాలకు బస్సు సౌకర్యం , పరీక్షా సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా సంబందిత శాఖలు చూడాలని అన్నారు. జిల్లాలో 73 పరీక్షా కేంద్రాల్లో 58,750 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని , డి.ఇ.ఓ. సహకరించాలని సూచించారు. ఎండల దష్ట్యా తాగునీరు , మెడికల్ డిపార్ట్ మెంట్ మెడికల్ క్యాంపుల ఏర్పాటు, ఓ ఆర్ ఎస్ అందుబాటులో వుంచాల్సివుంటుందని సూచించారు. ఎస్ హెచ్ ఓ లు పోలిస్ స్టేషన్ నందు ప్రశ్నాపత్రాలు భద్రత చూడాలని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసరాలలో 144 సెక్షన్ అమలు, జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని సూచించారు. ఈ సమీక్షలో ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారి స్వర్ణ లత , డి.ఇ.ఓ. శేఖర్ , వైద్య ఆరోగ్య , విద్యుత్ , పోలిస్ , ఆర్ టి సి శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ వర్ధంతి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తాళ్లపాక అన్నమాచార్యుల వారి సంకీర్తనలు రాగిరేకులపై నుంచి గ్రంథస్తం చేయడంతో పాటు వందల కృతులను స్వరపరిచిన సంగీత, సాహిత్య విద్వాంసులు రాళ్లపల్లి అనంతకృష్ణ 44వ వర్ధంతి ఈనెల 11న ఘనంగా నిర్వహించనున్నట్లు టిటిడి పిఆర్‌వో డాక్టరు టి.రవి ఒక ప్రకటనలో తెలిపారు. టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు, హిందు ధార్మిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సాయంత్రం ఆరు గంటలకు జరిగే కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

శ్రీవారి సేవలో సినీ నిర్మాత దిల్ రాజు

ప్రజాశక్తి - తిరుమల సొంత బ్యానరులో రూపొందిన 'బలగం' చిత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రేక్షకులు బ్రహ్మ రథం పట్టడంతో కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నామని నిర్మాత దిల్ రాజు అన్నారు. శుక్రవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. టిటిడి ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ త్వరలో దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న రాంచరణ్ చిత్రం షూటింగ్ పూర్తి అవుతుందని ఆయన తెలిపారు.

కుటుంబ పోషణలో మహిళలే కీలకం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మహిళలు తమ శక్తి సామర్థ్యాలను తమ కుటుంబం కోసమే వెచ్చిస్తున్నారని.. కుటుంబ సంరక్షణలో మహిళలదే కీలక పాత్రని పుత్తూరు సీడీపీవో పద్మజ అన్నారు. శుక్రవారం పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో పద్మజ మాట్లాడుతూ వ్యక్తిగత జాగ్రత్తలకు మహిళలు సమయం కేటాయించుకోవాలని.. పిల్లల పెంపకంలో మరింత జాగ్రత్తలు అవసరమని తెలిపారు. అనంతరం సెక్టార్ సూపర్‌వైజర్ గీతాంజలి మాట్లాడుతూ మహిళలు బాధ్యతతో.. ముందుచూపుతో కుటుంబాన్ని సంరక్షించుకోవాలని సూచించారు. మహిళా విద్య అత్యంత అవసరమని.. గ్రామాల్లోనూ ప్రతిఒక్కరూ చదువుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. వంద సంవత్సరాల క్రితమే మహిళా కార్మిక ఉద్యమంతో మహిళా దినోత్సవం ఆవిర్భవించిందదన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం ఆడపిల్లలు రక్తహీనతకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కార్యాలయం నుంచి మహిళలు ర్యాలీ నిర్వహించారు. చివరగా సీనియర్ కార్యకర్తలకు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భారతి, అంగన్వాడీ కార్యకర్తలు ధనమ్మ, మునికుమారి, ఆదిలక్ష్మమ్మ, భారతి, అనిత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రెండో రోజు శుక్రవారం డాక్టర్ పి.వి.దివాకర్ ఆధ్వర్యంలో మండల వైసీపీ ఎస్సీసెల్ కన్వీనర్ గెడితొట్టి గురవయ్య సహకారంతో 70 మంది గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

12న యాదవ్‌భవన్‌కు భూమిపూజ

ప్రజాశక్తి-గూడూరు రూరల్: ఉమ్మడి నెల్లూరు జిల్లా యాదవ భవన్ భూమి పూజ మహోత్సవం ఈనెల 12న ఆదివారం నెల్లూరు నగరంలోని గొలగమూడి రోడ్డు కొండాయపాలెం ప్రాంతంలో నిర్వహిస్తున్నట్లు నెల్లూరు జిల్లా గూడూరు యాదవ భవన్ ట్రస్టీ శ్రీ కష్ణ సేవా సమితి అధ్యక్షులు శ్యామసుందరరావు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి గూడూరు డివిజన్ నుంచి పెద్దఎత్తున యాదవులు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

14న పకడ్బందీగా నులిపురుగుల నివారణ దినం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ఈనెల 14న జరుగనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినం కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో దేవేంద్ర బాబు, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ హర్షవర్ధన్, వైద్యాధికారి డాక్టర్ శశికళ ఆధ్వర్యంలో అన్ని స్కూల్స్, కాలేజీలు, అంగన్వాడీ సెంటర్లకు ఆల్బెండజోల్ మాత్రలు ఆయా శాఖల సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ తేజస్వి, హైస్కూల్ క్లర్క్ మహబూబ్‌బాషా, హేమంత్, కల్పన, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ మునెమ్మకు పరామర్శ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం వడమాల సర్పంచ్ మునెమ్మ భర్త వెంకటాద్రి ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం వడమాలపేటలోని మునెమ్మను పరామర్శించి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రచయిత్రికి సేవా పురస్కారం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: భాకరాపేటకు చెందిన రచయిత్రి, ఉపాధ్యాయురాలు ఉషారాణి మరో సేవా పురస్కారం అందుకొన్నారు. రచయిత్రి, సేవకురాలు ధనాశి ఉషారాణి సేవా రంగంలో చేసిన సేవలకుగాను మహిళా దినోత్సవం రోజున ఉక్కు మహిళ సేవా పురస్కారాన్ని గ్లోబల్ హెల్ప్ ఫౌండేషన్ మార్కాపురం వారు గొంటుముక్కల చెన్నకేశవులు ప్రకటించారు. అనేక కథలు రాయడం, కవి సమ్మేళనం నిర్వహించడంలో గుర్తింపు తెచ్చుకొన్నారు. పలువురు రచయితలు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

మచిలీపట్నం నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా కిరణ్‌రాయల్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: మచిలీపట్టణం నియోజకవర్గ జనసేన కోఆర్డినేటర్‌గా తిరుపతికి చెందిన కిరణ్‌రాయల్‌ను నియమిస్తూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉత్తర్వులు జారీ చేశారు. జనసేన పార్టీ 10వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్న విషయం విదితమే. సభ ఏర్పాట్లు నిర్వాహణలో భాగంగా కిరణ్‌రాయల్‌ను ఆ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా నియమించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి, బాబ్జి అభినందించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-కేవీబీపురం: కేవీబీపురం జడ్పీ హైస్కూల్లో ఈనెల 13వ తేదీన జరుగనున్న ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13వ తేదీ నుంచి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని.. ప్రజలు, నాయకులు సహకరించాలన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో కలిసి కేంద్రాన్ని పరిశీలించారు. ఆర్ ఐ సుబ్రహ్మణ్యం, ఏఎస్ఐ లోకనాథం, వీఆర్వో మునిగోపాల్ పాల్గొన్నారు.

వెంకన్నపాలెం పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-కోట: వెంకన్నపాలెంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈవో వెంకట సునీల్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జరుగుతున్న పరీక్షలను, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు సరైన ఆహారాన్ని అందించేందుకు ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఏప్రిల్‌లో జరుగనున్న పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని.. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని డీఈవో డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. శుక్రవారం పుత్తూరు ఉప విద్యాశాఖ కార్యాలయంలో పుత్తూరు డివిజన్ చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంట్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ఆరు పేపర్లకు మాత్రమే పరీక్షలు100 మార్కులకు నిర్వహిస్తారని..పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో తాగునీరు, వెలుతురు, ఫ్యాన్లు, ఫర్నీచర్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. బాలికలను మహిళా ఉపాధ్యాయులు మాత్రమే పరిశీలించి పరీక్ష గదులకు పంపాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు, ఆరోగ్య సిబ్బంది ఉండేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పుత్తూరు ఉప విద్యాశాఖాధికారి రఘురామయ్య, ఎంఈవో తిరుమలరాజు, తిరుపతి డీసీసీబీ ఛైర్మన్ వంశీరాజా, ప్రధానోపాధ్యాయులు సురేష్, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

టీటీడీ కళాశాలల్లో చదవడం పూర్వజన్మ సుకృతం

ప్రజాశక్తి-క్యాంపస్: టీటీడీ కళాశాలల్లో చదవడం విద్యార్థినుల పూర్వజన్మ సుకృతమని జేఈవో సదా భార్గవి పేర్కొన్నారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాల 47వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జేఈవో మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని, పట్టుదలతో శ్రమిస్తే అనుకున్న స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. విద్యార్థినులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, క్రమశిక్షణతో నడుచుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. ఈ కళాశాలలో నిర్వహిస్తున్న డిఇసిఇ, డి.ఫార్మసీ గ్రూపులకు నేషనల్ బోర్డు అఫ్ అక్రిడిటేషన్ గుర్తింపు లభించడం హర్షణీయమన్నారు. ఇందుకోసం సహాయ సహకారాలు అందించిన అన్ని విభాగాల అధికారులకు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీటీడీ విద్యాశాఖ అధికారి డా. ఎం.భాస్కర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డా. జి.అసుంత, ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ ఎం.మునిరత్నం నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా యువత

ప్రజాశక్తి- పిచ్చాటూరు: యువకులు జల్సాల కోసం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని.. సీఐ సురేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నీరువాయి పంచాయతీ కార్యాలయం వద్ద యువతకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మంచి మార్గంలో ఉండాలని... క్రమశిక్షణతో ముందుకెళ్తే జీవితం సుఖమయంగా ఉంటుందన్నారు. అనంతరం ఇటీవల పోలీస్ ఉద్యోగాల్లో ప్రతిభ చూపిన పాల్ దినకర్‌ను అభినందించారు. అతనికి తండ్రి లేకపోవడంతో ఉద్యోగానికి అవసరమయ్యే ఖర్చు తనే భరిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వెంకటముని, సర్పంచ్ సుగ్రపియ వెంకటేష్, యువకులు పాల్గొన్నారు.

26న 'సి ఫర్ క్యాస్ట్' పుస్తకంపై సమీక్ష

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సమాజంలోని పరిస్థితులు, కుల రాజకీయాలతో దిగజారుతున్న విలువలు, సాంఘికోద్యమకారులకు ఎంతగానో ఉపయోగపడే ' సి ఫర్ క్యాస్ట్ ' పుస్తకంపై ఈనెల 26న ఎస్వీయూ సెనేట్ హాల్‌లో బ్లూ వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహిస్తున్నట్లు బ్లూ వింగ్స్ ఫౌండేషన్ చీఫ్ అడ్వైజర్ శివరామకృష్ణ రావు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివరామకృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగ రూపకర్త బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలను ఆచరణలను గ్రామస్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు అవగాహన కల్పించడం కోసం బ్లూ వింగ్స్ ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పొలిటికల్ లీడర్షిప్ వ్యవస్థాపకులు, సీనియర్ జర్నలిస్టు సతీష్ చందర్ రాసిన సి ఫర్ క్యాస్ట్ పుస్తకంలో సమాజంలో కుల వివక్షత, సివిల్ సర్వీసెస్, పరిశోధకులకు, శాస్త్ర విద్యార్థులకు అధ్యాపకులకు ఎంతగానో ఉపయోగంగా చక్కగా వివరించారన్నారు. కార్యక్రమానికి మేధావులు, విద్యార్థులు, అధ్యాపకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మల్లికార్జున, గోపి తదితరులు పాల్గొన్నారు.

బలిజభవన్ ప్రహరీ నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నరసింహతీర్థం రోడ్డు మార్గంలోని బలిజ భవన్‌కు కేటాయించిన స్థలంలో ఆదివారం ప్రహరీ నిర్మాణంకోసం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బలిజ జేఏసీ నాయకులు నీలం బాలాజీ, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, ఆర్కాట్ కష్ణ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డి చొరవతో బలిజ భవన్‌కు కేటాయించిన స్థలాన్ని శుభ్రపరచి ఆక్రమణలు జరగకుండా మొదట ప్రహరీ నిర్మించాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ఆళ్వారు మురళి, సురేష్ రాయల్, కిషోర్, కరుణానిధి తదితరులు పాల్గొన్నారు.

కుంట్రపాకంలో ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-క్యాంపస్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, జాతీయ సేవా పథకం యూనిట్-3, సంకల్ప సూపర్ స్పెషాలిటీ సౌజన్యంతో కుంట్రపాకం గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్-3 ప్రోగ్రాం అధికారి డాక్టర్ నీరజ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం వ్యక్తిగత జీవితంపైనే కాకుండా ఆర్థిక వ్యవస్థ పైన తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. సంకల్ప సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ వాణిరెడ్డి మాట్లాడుతూ 30 సంవత్సరాలు దాటిన మహిళలు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులను విధిగా చేయించుకోవాలని సూచించారు. మెనోపాజ్ తర్వాత మహిళలు కాల్షియం ఎక్కువగా ఉన్న ఆహారంతోపాటు కాల్షియం టాబ్లెట్లు వేసుకోవాలని సలహా ఇచ్చారు. కోవిడ్ మహమ్మారి ఆరోగ్య సమస్యలను మరింత తీవ్రతరం చేసిందని, ఇదివరకే ఉన్న అసమానతలు ఇంకా పెరిగాయని.. మహిళలు విధిగా పండ్లు, ఆకుకూరలు, గుడ్లు, పోషక విలువలు మెండుగా ఉన్న ఆహారాన్ని విధిగా తీసుకొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని చెప్పారు. 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శుభ, పద్మనాభ రెడ్డి, కరీముల్లా, సంకల్ప ఆసుపత్రి జనరల్ మేనేజర్ జాన్‌చౌదరి, మేనేజర్ ఆసిఫ్, ఇతర వైద్య సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

చంద్రగిరిలో రూ.430 కోట్లతో అభివృద్ధి పనులు

తిరుపతి బ్యూరో: చంద్రగిరి నియోజకవర్గంలో రూ.430 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చంద్రగిరిలో ఆయన ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నా కుటుంబం.. నా నియోజకవర్గ ప్రజలు వేరు కాదు' చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో జరగలేదని గట్టిగా నమ్ముతున్నానన్నారు. ఎన్నికలు వస్తున్నాయని తాను చెప్పడం లేదని.. ప్రతి పంచాయతీకి రూ.2.50 కోట్లకు తక్కువ లేకుండా నిధులు కేటాయించానని తెలిపారు. ప్రజల కోసం రూ.34 వేల విలువైన పెళ్లి కానుకలు అందజేస్తున్నానని..తన సంపదలో 75 శాతం ప్రజల కోసం ఖర్చు చేయడమే తన వ్యసనమన్నారు. 250 ఆర్వో వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేశానని, పర్యావరణ పరిరక్షణకు 10 లక్షల పూల, పండ్ల మొక్కలను పంపిణీ చేశానన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ ఆత్మీయ సభ నిర్వహణలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన ప్రత్యేకతను చాటుకున్నారని..వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకులకే సగం పథకాలను అందిస్తున్నామని తెలిపారు. అలుపెరగక ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అని కొనియాడారు. రాబోయే రోజుల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంపీ రెడ్డప్ప మాట్లాడుతూ అలుపెరగని పోరాట యోధుడు చెవిరెడ్డి అని..ప్రజలకు సేవ చేయలేక కుప్పం చంద్రబాబు పారిపోతే నారావారిపల్లెలో అభివృద్ధి చేసి చూపారన్నారు. తిరుపతి రూరల్ ఎంపీపీ మోహిత్ రెడ్డి మాట్లాడారు.

చేతక్ ప్రీమియం ఎలక్ట్రికల్ స్కూటర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: రేణిగుంట రోడ్డులోని శ్రీరామ్ ఎంటర్ ప్రైజస్ షోరూంలో శుక్రవారం కొత్త బజాజ్ చేతక్ ప్రీమియం ఎలక్ట్రికల్ స్కూటర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి హాజరై స్కూటర్ ను ఆవిష్కరించి మొదటి కస్టమర్‌కు అందజేశారు. షోరూం అధినేత, డీలర్ ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 1990లో తొలిసారిగా చేతక్ స్కూటర్ ను తాము ఆరంభించామని.. ప్రస్తుతం బజాజ్ చేతక్ ఎలక్ట్రికల్ స్కూటర్ ను ప్రారంభించడం ఆనందదాయకమన్నారు. చేతక్ ప్రీమియం ఎలక్ట్రికల్ స్కూటర్ పూర్తిగా మెటల్ బాడీతో రూపొందించబడిందని, 90 కిలోమీటర్లు నిజమైన మైలేజ్ ఇస్తుందని తెలిపారు. 4 గంటల పూర్తి ఛార్జ్‌తో ఇకోవో మోడ్లో కిలోమీటర్ కు సుమారు 3 యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతుందని తెలిపారు. బజాజ్ ఫైనాన్స్ సంస్థతో తక్కువ రూ.13,500 డౌన్ పేమెంట్‌తో రూ.4,500 నెలకు ఈఎంఐ తో తీసుకోవచ్చని తెలిపారు. ఎక్స్ షోరూం ధర రూ.1,22,216 కాగా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రూ.48,500, రాష్ట్ర ప్రభుత్వ రాయితీతో 12 శాతం జీవిత పన్ను పూర్తి మినహాయింపుతో లభిస్తుందని తెలిపారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శ్రీరామ్ ఎంటర్ప్రైజెస్ చేతక్ డీలర్స్ ఆర్.సాకేతిరామ్, ఆర్. అభినవ్ రామ్, బజాజ్ ఆటో జోనల్ మేనేజర్ గోపాల్ శ్రీవాత్సవ్ పాల్గొన్నారు.

పరమేశ్వరమంగళం పీహెచ్‌సీ తనిఖీ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పరమేశ్వర మంగళంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా అదనపు వైద్యాధికారిణి డాక్టర్ సుధారాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రోగులకు సక్రమమైన వైద్య పరీక్షలు, సేవలు అందించాలని సూచించారు. 14న నులిపురుగుల నివారణ దినం సందర్భంగా అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో మాత్రలను పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ హేమభూషణ్ రెడ్డి, డాక్టర్ కళ్యాణి, ఎంపీహెచ్‌వో రమేష్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ బాధ్యత పట్టభద్రులదే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్రంలో ప్రమాదంలో పడిన ప్రజాస్వామ్య పరిరక్షణ బాధ్యతను ప్రతి పట్టభద్రుడు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ డా.నివేదిత మోరె శుక్రవారం పిలుపునిచ్చారు. ఎంతో హుందాగా జరుపుకునే శాసనమండలి ఎన్నికలలో దిగజారుడు రాజకీయాలకు తెగించిన అధికార వైసిపి ప్రభుత్వానికి రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో తమ ఓటుతో గట్టి బుద్ధి చెప్పాలని డా.నివేదిత మోరె పలువురు పట్టభద్రులను కలిసి విన్నవించారు.

ఐదెకరాల చెరకు తోట దగ్ధం

ప్రజాశక్తి-పిచ్చాటూరు: కీలపూడి గ్రామానికి చెందిన రైతులు రామచంద్రరాజు, లక్ష్మణరాజులకు చెందిన సుమారు 5 ఎకరాల చెరకు తోట శుక్రవారం అగ్నిప్రమాదానికి గురై కాలిపోయింది. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మహిళా సంఘాలకు రుణమేళా

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మహిళా సంఘాలకు విరివిగా రుణాలు అందిస్తున్నామని.. ఇందుకోసమే రుణమేళా నిర్వహించామని పుత్తూరు సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ జయకుమార్ అన్నారు. స్థానిక సప్తగిరి గ్రామీణ బ్యాంకులో శుక్రవారం స్వయం సహాయక సంఘాలకు రుణ వితరణ కార్యక్రమం నిర్వహించారు. గత 30 రోజుల వ్యవధిలో తిరుపతి రీజియన్ పరిధిలో రూ.125 కోట్లు రుణ వితరణ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ ప్రవీణ్, బ్యాంకు ఇతర శాఖల అధికారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

శాస్త్రి ఇండో కెనడియన్ ప్రతినిధి మహిళా వర్సిటీ సందర్శన

ప్రజాశక్తి-క్యాంపస్: శాస్త్రి ఇండో కెనడియన్ సంస్థ ప్రోగ్రాం అండ్ మెంబర్ రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ మహముదా అల్దీన్ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె వర్సిటీలోని పొటెన్షియల్ ఏరియాస్‌ని గుర్తించి, వీరిని కెనడాలోని వివిధ విశ్వవిద్యాలయాలతో అనుసంధానం చేసే దిశగా చర్చలు జరిపారు. దీంతో రీసెర్చ్ , స్టూడెంట్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్‌కు మరిన్ని అవకాశాలు లభిస్తాయని, విద్యార్థులకు ఫారిన్ ఎక్స్పోజర్‌కి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ జమున దువ్వూరు, డీన్లు ప్రొఫెసర్ అనూరాధా, ప్రొఫెసర్ సుజాత ఇంటర్ నేషనల్ రిలేషన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ నిర్మల, బిజినెస్ మేనేజ్మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ విజయలక్ష్మి, డాక్టర్ శ్రీరజిని, డాక్టర్ రూప, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణలో బాధితులకు నష్టపరిహారం

ప్రజాశక్తి-నాయుడుపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోడ్లు మరియు భవనాల శాఖ వారు రోడ్ల విస్తరణ, అభివద్ధికి శ్రీకారం చుట్టారు. ఇందులో బాగంగా విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివద్ధిలో భాగంగా ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ (ఏ డి బి) ఆర్థిక సహాయంతో తిమ్మాజికండ్రిగ- కొత్తపేట, పండ్లూర్ రైల్వే గేట్ మీదుగా తిమ్మాజికండ్రిగ నుంచి ఎన్ హెచ్ -5 హైవే నాయుడుపేట వరకు 9 కి.మీ పొడవున 4 లైన్ల రోడ్డును విస్తరించేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో ఆర్ ఆర్ అసిస్టెంట్ ఉదయ్ భాస్కర్, రైజెస్ టీమ్ ఫీల్డ్ తనిఖీ చేశారు. రోడ్డు వెంబడి నష్టపోయే ఇళ్ల, పంటలు, ప్రభుత్వ ఆస్తులను పరిశీలించారు. నష్టపోయే కుటుంబాలను అడిగి వారి అభిప్రాయాలను, సలహాలను, సూచనలను తెలుసుకున్నారు. త్వరలోనే పరిహారం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ముని రామయ్య, నాగరాజు, రమణయ్య, రత్నయ్య పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి- పిచ్చాటూరు: జాతీయ పశు వ్యాధి నియంత్ర పథకంలో భాగంగా శుక్రవారం ముడియూరు గ్రామంలో డాక్టర్ ధనంజయులు ఆధ్వర్యంలో పశువైద్యశిబిరం నిర్వహించారు. 248 పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ధనుంజయులు మాట్లాడుతూ ఎండాకాలంలో దూడలకు, ఆవులకు తీవ్రమైన జ్వరం, నీరసం కొద్దిపాటి ఎండకు రొప్పడం, చూలు పశువులు ఈసుకుపోవడం, ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గటంతో నష్టాలు జరుగుతాయని తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసుకోవడంతో నష్టాలను నివారించుకోవచ్చని వివరించారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, GUDUR
I.A.NO. 175 OF 2019
O.S.NO. 107 OF 2016
1.Vaddi Jaya Gowri, ... Petitioner/Plaintiff
Vs
1.Nakka Venkatramanaiah,(Died) And 7 others .....Respondents/Defendants.
To
Address for respondents No.7,8
1. Nukala Aruna W/o Not Known
D/o Nakka Venkataramanaiah,
Hindu aged about, 40 Years,
Mukasali Street, Venkatagiri Town,
Tirupati, District, (Respondent No.7)
2. C. Padmavathi, W/o Not Known
D/o Nakka Venkataramanaiah,
Hindu aged about, 35 Years,
Mulasali Street, Venkatagiri Town,
Tirupati, District, (Respondent No.8)
NOTICE
పై తెలిపిన I.A.No.175/2019 in O.S. No. 107/2016 పిటిషనరు Permanent Injunction దావా వేసియున్నారు. అందులో ప్రతివాదులైన రెస్పాండెంట్స్ నెం. 7,8 వారుకు నోటీసు నిమిత్తం పై కోర్టు వారు తేది:17-03-2023 10.30గం॥లకు పై కోర్టు అందు హాజరు కావలెను. ఆక్షేపణలు ఉన్న యెడల స్వయంగా కాని లేక మీ తరపున వకీలు కానిపై కోర్టు నందు తేది. 17-03-2023,10.30 గం॥లకు హాజరు కావలెను. లేనియెడలపై కోర్టు వారు మీపై పరోక్షంగా తీర్మానించబడును.
KONDURU HARI PRASAD, B.A, B.L.,
ADVOCATE & NOTARY,
8/209-60- Vigneswarapuram,
Gudur-524-101, Tirupati District.,
Cell No. 9705054118
Advocate for the Petitioner